క్లుప్తంగా

వీధి కుక్కల ఏరివేత



కుక్కలను బంధిస్తున్న సిబ్బంది

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు పరిధి మల్కాపురం ప్రాంతంలో గురువారం వీధి కుక్కల ఏరివేత ప్రారంభించారు. గ్రామ సింహాల వల్ల పడుతున్న ఇబ్బందులను స్థానికులు వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఆమె సంబంధిత అధికారులకువీధి కుక్కలను నివారించాలని ఆదేశించారు. దీంతో గురువారం మల్కాపురం చుట్టుపక్కల ప్రాంతాలలో సిబ్బంది సంచరించి ఆ సమయంలో తిరుగుతున్న వీధి కుక్కలను పట్టుకున్నారు. వాటిని పశువుల ఆస్పత్రికి తరలించి గర్భదారణ రాకుండా శస్త్ర చికిత్స చేయించారు.

ఘనంగా సంపత్ వినాయక ఆలయ వార్షికోత్సవం



స్వామి వారి పల్లకీ సేవలో భక్తులు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు నెహ్రూ నగర్ ప్రాంతంలోని సంపత్ వినాయక ఆలయం 23వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మందిరంలో కొలువుదీరిన గణనాథుడికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. గరిక, జిల్లేడు పూలతో అర్చన చేశారు. పల్లకీ సేవలో భాగంగా స్వామి వారిని పుర వీధులలో పల్లకీపై ఊరేగింపుగా తీసుకువెళ్లారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. పూజా కార్యక్రమంలో స్థానిక నాయకులు రామ్మోహన్ నాయుడు, లాలం లావణ్య పాల్గొన్నారు.

ఎస్‌బీటీ బ్రిడ్జిపై ప్రజా వాహనాలు అనుమతించాలి



త్రినాథపురంలో పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

సింధియా: డాక్‌యార్డ్ బ్రిడ్జి మరమ్మతులు పూర్తయ్యేవరకు ఎస్‌బీటీ బ్రిడ్జిపై ప్రజా వాహనాలను అనుమతించాలని కోరుతూ సీపీఎం నాయకులు పాదయాత్ర చేపట్టారు. జీవీఎంసీ 62వ వార్డు పరిధి త్రినాథపురంలో సీపీఎం జోన్ నాయకులు పి.పైడిరాజు, పి.రామారావు, ఎల్.కృష్ణ, బి.జగ్గనాయుడు, బి.అర్జునరావు పాల్గొని, పాదయాత్ర చేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న షిప్‌యార్డ్ ఉద్యోగులు

సింధియా: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని షిప్‌యార్డ్ అధికారులు పేర్కొన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా షిప్‌యార్డ్ కాలనీలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ సముదాయంలో గురువారం యోగా శిబిరం నిర్వహించారు. యోగా వల్ల ఉపయోగాలను తెలియజేస్తూ అధికారులు, ఉద్యోగులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ అధికారులు, గుర్తింపు యూనియన్ ప్రతినిధులు, ఉద్యోగులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులుగా ఖాళీ స్థలాలు!

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



షిప్‌యార్డ్ కాలనీ ప్రహరీ అవతల డంప్ చేసిన చెత్త

సింధియా: పారిశ్రామిక ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. దీంతో పలు వీధుల్లో చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. మురుగు సక్రమంగా పారక కాలువలు కంపుకొడుతున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఇష్టానుసారం చెత్త పారబోత

పారిశ్రామిక ప్రాంతంలోని పలు డ్రైనేజీలు చెత్తాచెదారంతో నిండిపోయి రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తోంది. డంపర్ బిన్లు చెత్తతో నిండిపోతున్నా రోజుల తరబడి తొలగించడం లేదు. ఫలితంగా నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు డంపింగ్ యార్డులుగా మారి మురుగుకూపాలను తలపిస్తున్నాయి. దీంతో స్థానికులకు దోమల బెడద తప్పడం లేదు. ముఖ్యంగా జీవీఎంసీ 40వ వార్డు సింధియా న్యూకాలనీలోని షిప్‌యార్డ్ విద్యా సంస్థల వెనుక ఉన్న ఖాళీ స్థలంలో చెత్త వేసి డంపింగ్ యార్డ్‌గా వినియోగిస్తున్నారు. దీనికి ఆనుకుని విద్యాసంస్థలు, సాయి మందిరం, మరో పక్క కొండవాలు ప్రాంతాలైన జై ఆంధ్రాకాలనీ, కాకరలోవ గ్రామాలు ఉండడంతో చెత్త నుంచి వచ్చే దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. దోమల బెడద విపరీతంగా ఉంద స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్తతో పాటు జంతువుల మృత కళేబరాలను సైతం ఇక్కడకు తీసుకు వచ్చి వేయడంతో రోగాలు ప్రబలుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను చక్కదిద్దాలని కోరుతున్నారు.

పాత ఫొటోలతో వార్తలు ప్రచురించడం హేయం

- రాజకీయ పార్టీ కుట్రల్లో పత్రికలు భాగస్వామ్యం కావడం బాధాకరం
- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆగ్రహం



అసత్య వార్తలు రాసిన పత్రికలను చూపిస్తూ మాట్లాడుతున్న ఆనంద్ కుమార్

గోపాలపట్నం: టీడీపీ అధికార ప్రతినిధి కె.పట్టాభిపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ఈనాడు, ఆంధ్రజ్యోతిలో అసత్య వార్తలు ప్రచురించడం సరికాదని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పత్రికలు ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలి గానీ.. ఒక వ్యక్తికో, పార్టీకో వత్తాసు పలికేలా ఉండరాదని హితవు పలికారు. మర్రిపాలెం వుడా లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత ఫొటోలు వేసి వార్తలు ప్రచురించడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించి, సానుభూతి పొందేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. పాలన విషయంలో తప్పు పట్టలేక.. అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో వేలెత్తి చూపించలేక, లోకేష్ పాదయాత్ర ఫెయిల్ కావడంతో ఏమీ చేయలేని స్థితిలో ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గన్నవరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం దహనకాండ ఘటనలోనూ టీడీపీ కార్యకర్తలు విధ్వంసం సృష్టించి, పోలీసులను గాయపరిచారన్నారు. వారి చర్యలు బయటకు రాకుండా, ప్రభుత్వంపై బురద జల్లే కుట్రలు చేస్తున్నారన్నారు. టీడీపీకి, చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో ఏపీ స్కిల్ అండ్ ట్రైనింగ్ జాబ్ ఫెయిర్ అడ్వైజర్ గాది శ్రీధర్ రెడ్డి, జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, కార్పొరేటర్లు పి.వి. సురేష్, ముర్రు వాణి, గుండపు నాగేశ్వరరావు, వార్డు అధ్యక్షులు చుక్క ప్రసాదరెడ్డి, దొడ్డి కిరణ్, సోమాదుల సురేష్, పార్టీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

సుందరీకరణ పనులు వేగవంతం

జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు



ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ రాజాబాబు

గోపాలపట్నం: జీ–20 సదస్సు మార్చి నెలలో నిర్వహించనున్న నేపథ్యంలో జాతీయ రహదారిలో సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు అధికారులను ఆదేశించారు. రెండో రోజు గురువారం ఆయన వంటిల్లు వద్ద నుంచి మారియట్ హోటల్ వరకు కాలినడకన పర్యటించారు. రహదారికి ఇరువైపులా ఉన్న సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. రహదారిలో గ్రీన్ బెల్టును శుభ్రపరచాలని పారిశుద్ధ్య అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు ఏడీసీ సన్యాసిరావు, సీసీపీ సురేష్, డీడీహెచ్ దామోదర్, ఎస్‌ఈలు రామ్మోహన్, వేణుగోపాలరావు, డీసీపీ రత్నకుమార్, జోన్–5 జెడ్సీ కృష్ణ, జోన్–8 జెడ్సీ మల్లయ్య నాయుడు, ఏసీపీ రమణమూర్తి, ఈఈ సంతోషి కుమారి, జోన్–5 ఏఎంహెచ్‌వో రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్కాపురం: శ్రీహరిపురం సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరాకాలనీ1,2 ప్రాంతాలు, జవహర్‌నగర్,బర్మాకాలనీ,జనతాకాలనీ,సెయింట్ ఆన్స్ ఆస్పత్రి ఏరియా తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంతరాయం ఉంటుందన్నారు.

మల్కాపురం సబ్‌స్టేషన్ పరిధిలో...

మల్కాపురం సబ్‌స్టేషన్ పరిధిలో జనతాకాలనీ,జైఆంధ్రకాలనీ, ప్రియదర్శినికాలనీ, రామకృష్ణాపురం,యారాడ పార్కు ఏరియా, హౌసింగ్‌బోర్డు ఏరియా, త్రినాథపురం ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది.

పౌరులు చైతన్యవంతం కావాలి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇస్తున్న భాగ్యలక్ష్మి

మల్కాపురం: ప్రజలు చైతన్యవంతులైనప్పుడే ప్రజాస్వామ్యం విజయవంతం అవుతుందని స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాల రాజనీతి శాస్త్ర విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. కళాశాల ఆవరణలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'భారత రాజకీయాలు – పౌరుల చైతన్యం 'అనే అంశంపై గురువారం సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రజలు విద్యావంతులు, చైతన్యవంతులు అయ్యారన్నారు. ఇది మంచి పరిణామం అన్నారు. రాజనీతి శాస్త్ర విభాగ సీనియర్ అధ్యాపకురాలు వై.అనసూయాదేవి మాట్లాడుతూ పౌరులు సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు, మీడియా ద్వారా తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలపాలన్నారు.అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు పలు అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు.

సంజీవరెడ్డికి అభినందనలు



ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డిని సత్కరిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

సింధియా: ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ సంజీవరెడ్డిని గురువారం ఇక్కడి ఐఎన్‌టీయూసీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. న్యూఢిల్లీలో జరుగుతున్న 33వ ప్లీనరీ సమావేశాలకు హాజరైన ఐఎన్‌టీయూసీ నాయకులు జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ సంజీవరెడ్డిని ఘనంగా సత్కరించారు.

ట్రాఫిక్ సిబ్బందికి రేడియం జాకెట్స్ పంపిణీ



సిబ్బందికి రేడియం జాకెట్లు అందిస్తున్న సీఐ అశోక్ కుమార్

గోపాలపట్నం: గోపాలపట్నం ట్రాఫిక్ సిబ్బందికి ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్ రేడియం జాకెట్లను పంపిణీ చేశారు. గోపాలపట్నంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ సిబ్బందికి ఈ జాకెట్లు చాలా ఉపయోగకరమన్నారు. రహదారిపై ట్రాఫిక్ నియంత్రించే సమయంలో వాహనచోదకులు దూరం నుంచి గుర్తించే విధంగా ఉంటాయన్నారు. చినముషిడివాడకు చెందించిన పంచముఖ గాయత్రి ఆలయ ట్రస్టీ సరస్వతుల నరసింహమూర్తి సౌజన్యంతో వీటిని సమకూర్చినట్లు చెప్పారు. ఈ జాకెట్లకు రేడియం రిబ్బన్లు ఉండటం వల్ల, రాత్రి సమయంలో వాహనచోదకులు ట్రాఫిక్ సిబ్బంది ఉన్నట్లు గుర్తించి, వాహనవేగం తగ్గించే అవకాశం ఉందన్నారు. దీనివల్ల ప్రమాదాలు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ జి.రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



బుచ్చిరాజుపాలెం గాంధీనగర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డులో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టభద్రుల ఓటర్ల ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. కరపత్రాలు అందించారు. 90వ వార్డు కార్యదర్శి దొడ్డి సతీష్ కుమార్, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పురెడ్డి వరలక్ష్మి, రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రయాణికుల ముసుగులో నగలు చోరీ

గోపాలపట్నం: ప్రయాణికుల ముసుగులో ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ నుంచి బంగారం చోరీ చేసిన ఘటన ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధి బాజీ జంక్షన్ వద్ద బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితురాలు షేక్ హసెన్‌బీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం సంతోష్‌నగర్‌లో నివాసముంటున్న షేక్ హసెన్‌బీ బుధవారం సాయంత్రం గోపాలపట్నం సోనోవిజన్ వద్ద ఆటో ఎక్కింది. కొద్ది దూరం వెళ్లాక ముగ్గురు మహిళలు ఆటో ఎక్కారు. ఎన్‌ఏడీ జంక్షన్ వద్ద ఆటో దిగి చూసుకునే సరికి హ్యాండ్ బ్యాగ్ తెరిచి ఉంది. లోపల ఉంచిన బంగారు ఆభరణాల స్టీల్ బాక్స్ కనిపించలేదు. వెంటనే ఆటో కోసం చూడగా వేగంగా మర్రిపాలెం వైపు వెళ్లి పోయింది. తనను మధ్య పెట్టి మధ్యలో ఎక్కిన ముగ్గురు మహిళలే చోరీ చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తోంది. బాక్స్‌లో 2 తులాల చైన్, జత చెవి దుద్దులు కలిపి మొత్తం 4 తులాలు ఉంటుందని తెలిపింది. ఎస్‌ఐ కాంతారావు దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా పద్య సంకీర్తనం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వకళా పరిషత్ తెలుగు విభాగం, సమైక్య భారతి సంయుక్త ఆధ్వర్యంలో బమ్మెర పోతనామాత్యుని భాగవత ఆణిముత్యాలు పద్య సంకీర్తనం గురువారం నగరంలో ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ తెలుగు భాషా ఉత్సవాలు–2023లో భాగంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం–తెలుగు ప్రాశస్త్యం అనే అంశంపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో ప్రథమంగా ఉదయం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోతనామాత్యునిగా డాక్టర్ మూర్తి రేమెళ్ల తాళపత్రాలను చేతపట్టి ఘంటంతో రాస్తూ పుర వీధుల్లో నడిచిన విధానం నగర ప్రజలను ఆశ్చర్యచకితుల్నిచేసింది. ఈ విధంగా ఆయన ముందు నడవగా భాగవత ఆణిముత్యాల బృందం పద్య పఠనం చేస్తూ అనుసరించింది. ఆంధ్ర విశ్వకళాపరిషత్ ప్రధాన ద్వారం వద్ద ప్రారంభమైన పద్య సంకీర్తనం సిరిపురం ప్రధాన కూడలి మీదుగా తెలుగు విభాగం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు, ఆచార్య వెలమల సిమ్మన్న, ఆచార్య జి.యోహానుబాబు, డాక్టర్ బూసి వెంకటస్వామి, పూర్ణిమా రేమెళ్ల, వెంకటేశ్వరరావు, డాక్టర్ జె.కె.కిషోర్, సి.వి.హెచ్.ఎస్.శర్మ, శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కెమికల్ పరిశ్రమల్లో ప్రమాదాలపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు,వైద్య సిబ్బంది



మాక్ డ్రిల్‌లో భాగంగా కార్మికులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మల్కాపురం: కెమికల్ పరిశ్రమల్లో జరిగే ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై కార్మికులకు అవగాహన,మాక్ డ్రిల్ నిర్వహించారు. కేంద్ర,రాష్ట్ర విపత్తుల నివారణ సంస్థల ఆధ్వర్యంలో స్థానిక ఈస్ట్ ఇండియా లిమిటెడ్ కంపెనీలో విపత్తులను ఎలా ఎదుర్కోవాలి, ఆపదలో ఉన్న వారిని ఎలా కాపాడాలో మాక్‌డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. ప్రమాదంలో గాయపడిన వారికి ఎలాంటి వైద్యం అందించాలో వివరించారు. మల్కాపురం మరిడిమాంబ కల్యాణమండపంల్లో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్‌డీఎం ప్రతినిధి పి.ఎస్.సర్కార్,రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ రసాయన పరిశ్రమల్లో తలెత్తే ప్రమాదాల నుంచి తప్పుకునే విధానాలు, కార్మికులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, తహసీల్దార్ డి.వీరభద్రరావు, కోరమండల్ అధికారి శ్రీనివాసరావు,శ్రీకాంత్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో ప్రతిభ చూపిన కండక్టర్‌కు సత్కారం



కండక్టర్ బాబును సత్కరిస్తున్న డిపో మేనేజర్ రాజశేఖర్ తదితరులు

గోపాలపట్నం: సింహాచలం డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్న కె.ఆర్. బాబు అథ్లెటిక్స్‌లో బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ నెల 16న కోల్‌కతాలో నేషల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 400 మీటర్ల పరుగు పందెంలో బాబు మూడో స్థానం దక్కించుకుని బ్రాంజ్ మెడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా సింహాచలం డిపోలో ఆయన్ను గురువారం డిపో మేనేజర్ కె. రాజశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ ఎల్, సాయి తులసి, కేజీవీ కొండలరావు ఘనంగా సత్కరించారు. సహ ఉద్యోగులు, సూపర్‌వైజర్లు అభినందించారు.

ఇండోర్ ఆటపరికరాల వితరణ



చెస్, క్యారమ్స్ పరికరాలను విద్యార్థులకు అందిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహించేందుకు మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు ఆట పరికరాలను గురువారం అందించారు.

ఈ మేరకు బర్మా క్యాంపు జీవీఎంసీ పాఠశాల విద్యార్థులకు ఇండోర్ గేమ్స్‌లో పాల్గొనే విధంగా అవసరమైన క్యారమ్స్, చెస్ బోర్డులను అందించారు. దీంతో పాటు వ్యాయామ సమయంలో వినియోగానికి అవసరమైన కార్డ్‌లెస్ మైక్‌ను పాఠశాల హెచ్‌ఎం సాయి లక్ష్మికి అందించారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ స్వరూప రాణి, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శేషామణి, ఎస్.పుష్పలత, పూర్వ అధ్యక్షురాలు కె.మాధవి, ఉపాధ్యక్షురాలు జి.వరలక్ష్మి, సంయుక్త కార్యదర్శి ఎ.జయశ్రీ, ఎ.లక్ష్మి పాల్గొన్నారు. యోగా టీచర్ ఎం.శేషామణి విద్యార్థులతో యోగా చేయించారు. యోగాసనాలపై ఉచితంగా శిక్షణనిస్తామని ఆమె చెప్పారు.

అలరించిన సినీ సంగీత విభావరి



పాటలు పాడుతున్న గాయనీ గాయకులు

సీతంపేట: సాంస్కృతిక రాజధానిగా రూపుదాల్చిన విశాఖలో దివికేగిన సినీ దిగ్గజాల స్మారకార్థం సంగీత కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని గీతం విశ్వవిద్యాలయం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ అన్నారు. ఆత్రేయ స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం విశాఖ పౌరగ్రంథాలయంలో కళాతపస్వి కె.విశ్వనాథ్, నేపథ్యగాయనీ వాణీ జయరామ్‌ల స్మారకార్థం నిర్వహించిన సినీ సంగీత విభావరికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజయ్ నిర్మాణ్ కంపెనీ అధినేత ఎస్.విజయ్‌కుమార్ మాట్లాడుతూ తెలుగు భాషా విలువలను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన దర్శకుడు కె.విశ్వనాథ్ అని.. జాతీయ స్థాయి గుర్తింపు పొందిన వాణీ జయరామ్‌లు సినీ ప్రపంచానికి దూరం కావడం విచారకరమన్నారు. ఈ సందర్భంగా రమేష్ పట్నాయక్, శ్రీవిద్య పాడిన అందెల రవమిది, శంబర జోగారావు శైలజ పాడిన రేపల్లియ యెద ఝల్లున పొంగిన రవళి, వీకే రాజు శృతి పాడిన రాగాల పల్లకిలో, రాజేంద్రప్రసాద్, కల్యాణి పాడిన ఒక పూల బాణం పాటలు ప్రేక్షకులను అలరించాయి. పాడుతా తీయగా విన్నర్ సార్థక్, లక్ష్మీశైలజ, పి.ఎల్.నాయుడు, కోసూరు రాజు, దీప్తి పలు హిట్‌సాంగ్స్ పాడి వీనుల విందుచేశారు. ఈ కార్యక్రమంలో ఆత్రేయ స్మారక కళా పీఠం ప్రధాన కార్యదర్శి గంటి మురళి, పైడా విద్యాసంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, వైభవ్ జ్యూలర్స్ అధినేత్రి గ్రంథి మల్లిక, వ్యాపారవేత్త పువ్వాడ శోభన్ ప్రకాష్, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, కళా సంస్థల ప్రతినిధులు చెన్నా తిరుమలరావు, ఎం.వి.రాజశేఖర్ పాల్గొన్నారు.

ఉక్కు సంకల్పంతో ప్లాంట్ పరిరక్షణ



శిబిరంలో పాల్గొన్న స్టీల్ ఎస్ఎంఎస్-2 ఉద్యోగులు

కూర్మన్నపాలెం: వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఉక్కు సంక్పలంతో ఉద్యోగులు పోరాటాలు చేయాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారం నాటికి 742వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఎస్ఎంఎస్–2 డిపార్టుమెంట్‌కు చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకూ పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. ఎంతోమంది ప్రాణాలను, భూములను త్యాగం చేసి సాధించుకున్న ఉక్కు పరిశ్రమను ప్రైవేటుపరం చేస్తామనడం సరికాదన్నారు. దీనికోసం ఉద్యమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కర్మాగార పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి



పెదగంట్యాడ పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ శాంతి

పెదగంట్యాడ: గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ స్టేట్ కన్సల్టెంట్ హెడ్ డాక్టర్ శాంతి, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ జీవనరాణి సూచించారు. పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం వారు సందర్శించారు. ఆస్పత్రి ఓపీని పరిశీలించి, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆరోగ్య సిబ్బంది సమయ పాలన పాటించాలని ఆదేశించారు. గర్భిణులకు హెచ్‌బీ పరీక్షలు నిర్వహించడంతో పాటు వాటిని సక్రమంగా పరిశీలించి ఆపై ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఆదేశించారు. గర్భిణుల ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు తెలుసుకోవాల్సిన బాధ్యత ఆరోగ్య సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ శాంతి అన్నపూర్ణ, ఆరోగ్య విస్తరణాధికారి తనకాల సత్యనారాయణ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.